## క్లుప్తంగా...

### డ్రైనేజీ మరమ్మతుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్ తదితరులు

**యాకుత్‌పురా:** డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి మరమ్మతు పనులు చేపడుతున్నామని రెయిన్ బజార్ కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్ తెలిపారు. డివిజన్ పరిధిలోని యాకుత్‌పురా, సూర్యాజంగ్ దేవిడి బస్తీల్లో చేపట్టిన డ్రైనేజీ మరమ్మతు పనులు బుధవారం ఆయన జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మజ్లిస్ పార్టీ అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఆదేశాల మేరకు ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యమిస్తూ ముందుకెళ్తున్నామన్నారు. ఈ పర్యటనలో అధికారులు, మజ్లిస్ నాయకులు పాల్గొన్నారు.

### స్విమ్మింగ్‌లో సత్తా చాటిన రోహన్‌రెడ్డి



**గన్‌ఫౌండ్రీ:** చెన్నైలో జరుగుతున్న సౌత్ వెస్ట్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ అక్వటిక్ చాంపియన్‌షిప్ పోటీలలో అనురాగ్ యూనివర్సిటీకి చెందిన కైలా రోహన్‌రెడ్డి సత్తాచాటారు. 100 మీటర్స్, 50 మీటర్ల విభాగాలలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచి ఫైనల్ పోటీలకు చేరుకున్నాడు. రాబోయే రోజుల్లో స్విమ్మింగ్ పోటీలలో మరింత ఉన్నతస్థాయికి ఎదగాలని పలువురు ఆకాంక్షించారు.

### తహసీల్దార్‌కు సన్మానం



**చాంద్రాయణగుట్ట:** బండ్లగూడ తహసీల్దార్‌గా నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన ప్రవీణ్ కుమార్‌ను లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు బానావత్ శంకర్‌నాయక్ సన్మానించారు. ఈ మేరకు కార్యాలయంలో ఆయనకు శాలువా కప్పి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు భరత్ నాయక్, రాష్ట్ర ప్రైవేట్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రాజు నాయక్, ఉపాధ్యక్షుడు మురళీ నాయక్ పాల్గొన్నారు.

### పదోన్నతులు కల్పించడం హర్షణీయం



డీహెచ్ రవీందర్ నాయక్‌ను సన్మానిస్తున్న సెంట్రల్ ఫోరం నాయకులు

**సుల్తాన్‌బజార్:** రాష్ట్ర వ్యాప్తంగా 7 జోన్లలో ఖాళీగా ఉన్న 58 ఆఫీస్ సూపరింటెండెంట్ పోస్టుల పదోన్నతులు కల్పించడంపై టీఎన్జీఓస్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ సెంట్రల్ ఫోరం హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు సంఘం సెంట్రల్ ఫోరం అధ్యక్ష కార్యదర్శులు ఇ.కిరణ్‌రెడ్డి, ఎం.సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ..వైద్య ఆరోగ్యశాఖలో ఖాళీగా ఉన్న క్యాడర్ల పదోన్నతులను సాధ్యమైనంత తొందరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆఫీస్ సూపరింటెండెంట్లకు పదోన్నతుల ప్రక్రియ ఎలాంటి అవరోధాలు లేకుండా చేపట్టిన ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ బి.రవీందర్ నాయక్, ఇతర అధికారులకు తాము ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. అనంతరం డీఎహెచ్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీఓస్ యూనియన్ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు రవి ప్రకాష్, ఈశ్వర్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్, హన్మకొండ జిల్లా అధ్యక్షులు ఆకుల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

### సట్టా నిర్వాహకుల అరెస్ట్

**అబిడ్స్:** సట్టా నిర్వహిస్తున్న నిందితులను షాహినాయత్‌గంజ్ పోలీసులు టాస్క్‌ఫోర్స్ సౌత్‌జోన్ పోలీసులతో కలిసి అరెస్టు చేశారు. వారి వద్ద 15 సెల్‌ఫోన్లను రూ.30,760ను స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ బాలు చౌహాన్ తెలిపిన వివరాల ప్రకారం.. జుమ్మెరాత్ బజార్‌కు చెందిన విశాల్ సింగ్, తాడ్‌బన్‌కు చెందిన నరేష్‌కుమార్, అప్పర్ ధూల్‌పేట్‌కు చెందిన అంకిత్ సింగ్, ధూల్‌పేట్‌కు చెందిన అక్షయ్ సింగ్‌తో పాటు మరో 20 మంది సెల్‌ఫోన్ల ద్వారా సట్టా నిర్వహిస్తున్నారు. పోలీసులు మఫ్టీలో ఉండి 24 మంది నిందితులను అరెస్టు చేశారు.

# ‘గేమ్’ ఓవర్

**పేరుకే మొఘల్‌పురా స్పోర్ట్స్ కాంప్లెక్స్**
- అందుబాటులో లేని ఆటలు
- కాంప్లెక్స్‌లో కొనసాగుతున్న జీహెచ్ఎంసీ కార్యాలయాలు
- గ్రౌండ్ ఫ్లోర్‌లో అక్రమ పార్కింగ్



మొఘల్‌పురా స్పోర్ట్స్ కాంప్లెక్స్

**చార్మినార్:** పేరుకే మొఘల్‌పురా స్పోర్ట్స్ కాంప్లెక్స్.. వాస్తవానికి ఇక్కడ కొనసాగుతోంది జీహెచ్ఎంసీ చార్మినార్ సర్కిల్–9 డిప్యూటీ కమిషనర్ కార్యాలయాల సముదాయాలు. 2017లో రెండు అంతస్తుల్లో నిర్మితమైన ఈ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో స్పోర్ట్స్ కాకుండా జీహెచ్ఎంసీ కార్యాలయాలు కొనసాగుతున్నాయి. గ్రౌడ్ ఫ్లోర్‌లో పూర్తిగా అక్రమ పార్కింగ్ కొనసాగుతుండగా స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రాంగణం ప్రధాన గేట్‌కు ఒక వైపు సర్కిల్–9కు చెందిన ఎగ్జిక్యూటివ్ ఇంజినీరింగ్ కార్యాలయం, వెనుక వైపు పత్తర్‌గట్టి డివిజన్‌కు చెందిన కార్డు కార్యాలయం ఉంది. ఇక మిగిలిన కొంత ఖాళీ స్థలంలో జీహెచ్ఎంసీ సిబ్బంది, అధికారుల వాహనాలతో పాటు ప్రైవేట్ వాహనాలు పార్కింగ్ చేశారు. ఇక గ్రౌడ్ ఫ్లోర్‌లో మిగిలిన కొద్దిపాటి స్థలంలో విద్యార్థులు ఫుట్‌బాల్, క్రికెట్ ఆడుతున్నారు. ఇక ఈ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లోని మొదటి అంతస్తులో 2021 నుంచి సర్కిల్–9 కార్యాలయాలు కొనసాగుతున్నాయి. డిప్యూటీ కమిషనర్‌తో పాటు టౌన్ ప్లానింగ్, ట్యాక్స్, యూసీడీ, కార్యాలయాలతో పాటు ఏఎంహెచ్ఓ కార్యాలయాలు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం ఇక్కడ ఆటలు ఆడుకోవడానికి ఇక్కడ ఏమాత్రం అవకాశాలు లేకుండా పోయాయి.

**2017 ఏప్రిల్ 18న అందుబాటులోకి..**

2017 ఏప్రిల్ 18న అప్పటి మేయర్ బొంతు రామ్మోహన్ ఆధ్వర్యంలో హోం శాఖ మంత్రి మహ్మద్ మహమూద్ అలీ మొఘల్‌పురా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను ప్రారంభించి పాతబస్తీ క్రీడాకారులకు అందుబాటులోకి తెచ్చారు. మొదట్లో రెండు అంతస్తుల్లో పలు ఇండోర్ గేమ్స్ అందుబాటులో ఉండేవి. యువతీ యువకులు ఈ ఇండోర్ గేమ్స్‌ను ఆడుతూ ఎంజాయ్ చేశారు. రాను రాను కొన్ని ఆట వస్తువులు విరిగిపోవడంతో పాటు సరైన వసతులు అందుబాటులో లేకుండా పోయాయి. దీనికి తోడు గతంలో వచ్చిన కరోనా కారణంగా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌కు క్రీడాకారుల రద్దీ తగ్గింది. దీంతో ఇక్కడికి జీహెచ్ఎంసీ చార్మినార్ సర్కిల్–9 డీసీ కార్యాలయాలను తరలించారు.

**ప్రస్తుతం గేమ్స్ అందుబాటులో లేవు..**

మొఘల్‌పురా స్పోర్ట్స్ కాంప్లెక్స్ రెండు అంతస్తుల్లో ఎలాంటి ఇండోర్ గేమ్స్ అందుబాటులో లేవు. వాస్తవానికి రెండో అంతస్తులో ఇప్పటి వరకు కొనసాగిన జిమ్, యోగా, వాలీబాల్, షటిల్, వెయిట్ లిఫ్టింగ్ తదితర ఇండోర్ గేమ్స్‌కు సంబంధించిన అన్ని రకాల ఆట వస్తువులు విరిగిపోవడంతో ప్రస్తుతం ఇవేవీ కొనసాగడం లేదు. తలుపులు, కిటికీలు సైతం విరిగిపోయాయి. సెక్యూరిటీ గార్డులు లేకపోవడంతో కొంత మంది గుర్తు తెలియని వ్యక్తులు అక్రమంగా లోనికి ప్రవేశించి ఆట వస్తువులను విరగొట్టడం జరిగింది. ఈ విషయాన్ని సంబంధిత అధికారులకు తెలియజేశాం.

–ఇంతియాజ్ అహ్మద్, స్పోర్ట్స్ ఇన్‌స్పెక్టర్

## సమస్యల పరిష్కారానికి కృషి: ఎమ్మెల్యే కౌసర్



సమస్యలు వింటున్న ఎమ్మెల్యే కౌసర్

**గోల్కొండ:** సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. బుధవారం టోలిచౌకీలోని మెరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో తనను కలవడానికి వచ్చిన వారితో మాట్లాడారు. లంగర్‌హౌస్‌కు చెందిన ఓ వ్యక్తి తన కూతురి పెళ్లి కోసం గత సంవత్సరం తాను కల్యాణలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకున్నామని అయితే ఇంకా చెక్కు రాలేదని మొరపెట్టుకున్నారు. అలాగే ప్రజా పాలనలో గృహజ్యోతి, ఆసరా పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్నా ఇప్పటి వరకు సంబంధిత అధికారులు తమను సంప్రదించలేదని మరికొందరు ఆయనకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అసెంబ్లీ సమావేశాలు ముగిసిన తర్వాత వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేస్తానన్నారు. ఈ సమావేశానికి ప్రజలను కూడా పిలుస్తామన్నారు. నేరుగా ప్రజలు అధికారులకే తమ తమ ఫిర్యాదులను విన్నవించుకునేలా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

## నిరుపయోగంగా ఉన్న స్తంభాల తొలగింపు



స్తంభాల తొలగింపును పరిశీలిస్తున్న మీర్‌చౌక్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్

**యాకుత్‌పురా:** ఫుట్‌పాత్ ఆక్రమణలు, నిరుపయోగంగా ఉన్న బీఎస్ఎన్ఎల్ టెలిఫోన్ స్తంభాలను తొలగిస్తున్నామని మీర్‌చౌక్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ నయీముద్దీన్ తెలిపారు. బుధవారం ఆయన బీఎస్ఎన్ఎల్ సిబ్బంది, పోలీసులతో కలిసి తలాబ్‌కట్టా, భవానీనగర్, బీబీ బజార్ చౌరస్తా ప్రాంతాల్లో ఫుట్‌పాత్ ఆక్రమణలు, నిరుపయోగంగా ఉన్న స్తంభాలను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్టేషన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. పాతబస్తీలోని పలు ప్రాంతాల్లో కొందరు రోడ్డుపై నిరుపయోగంగా ఉన్న స్తంభాలను ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్నారని తెలిపారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా స్తంభాలను తొలగించాలని బీఎస్ఎన్ఎల్ అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు.

## నేడు, రేపు పాతబస్తీలో ట్రాఫిక్ ఆంక్షలు

**చార్మినార్:** రక్షాపురం సమీపంలోని డీఆర్ డీఓ వద్ద ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులకు సంబంధించి అటువైపు నుంచి రాకపోకలు సాగించే వాహనదారులకు ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు నగర ట్రాఫిక్ అదనపు పోలీస్ కమిషనర్ విశ్వప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19, 20 తేదీలలో ఈ ట్రాఫిక్ ఆంక్షలు కొనసాగనున్నాయన్నారు. 19 న రాత్రి 11 గంటల నుంచి డీఎంఆర్ ఎల్ క్రాస్ రోడ్డు నుంచి ఆరాంఘర్ వరకు ఇన్నర్ రింగ్ రోడ్డుకు ఇరువైపులా ట్రాఫిక్ అనుమతించబడదన్నారు. 20న ఉదయం 5గంటల వరకు ట్రాఫిక్ దారి మళ్లింపులు అమలు చేయబడతాయన్నారు.

**ట్రాఫిక్ దారి మళ్లింపులు ఇలా..**

- ఆరాంఘర్, కాటేదాన్ నుంచి సంతోష్‌నగర్, సాగర్ రింగ్ రోడ్డు వైపు వచ్చే ట్రాఫిక్ అనుమతించబడదు. కాటేదాన్ ఎక్స్ రోడ్లు, ఆరాంఘర్ ఎక్స్ రోడ్లు, బహదూర్‌పురా జూపార్క్ రోడ్డు వైపు వాహనాలను దారి మళ్లించబడతాయి.
- సాగర్ రింగ్ రోడ్డు, సంతోష్‌నగర్ నుంచి కాటేదాన్, ఆరాంఘర్ వైపు వచ్చే ట్రాఫిక్ అనుమతించబడదు. మంద మల్లమ్మ జంక్షన్ వద్ద బాలాపూర్ ఎయిర్‌పోర్ట్ రోడ్డు, పహాడీ షరీఫ్, మహబూబ్‌నగర్ క్రాస్ రోడ్ ఇన్నర్ రింగ్ రోడ్‌లో ఆరాంఘర్ వైపు మళ్లిస్తారు.
- శ్రీశైలం హైవే నుంచి సాగర్ రోడ్డు వైపు వచ్చే ట్రాఫిక్ అనుమతించబడదు.
- బాలాపూర్ ఎయిర్‌పోర్ట్ రోడ్డు, మంద మల్లమ జంక్షన్, సాగర్ రహదారి వైపు మళ్లించబడు తుంది.
- ఫలక్‌నుమా నుంచి డీఎంఆర్ఎల్ ఎక్స్ రోడ్ల వైపు వచ్చే ట్రాఫిక్ అనుమతించబడదు. మహబూబ్ నగర క్రాస్ రోడ్ వద్ద శ్రీశైలం రహదారి, బాలాపూర్ విమానాశ్రయం రహదారి మంద మల్లమ్మ జంక్షన్ వైపు మళ్లించబడుతుంది.
- ప్రయాణంలో ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో, ప్రయాణ సహాయం కోసం ట్రాఫిక్ హెల్ప్‌లైన్ 9010203626కు కాల్ చేయండి.

### పుస్తకావిష్కరణ



**గన్‌ఫౌండ్రీ:** పోలీసుల గురించి పుస్తకాన్ని రాయడం అభినందనీయమని అడిషనల్ డీసీపీ రాందాస్ తేజావత్ అన్నారు. బుధవారం ట్రాఫిక్ కంట్రోల్ రూమ్‌లో రామదాసు సాహితీ కళా సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు దూత రామకోటేశ్వర్‌రావు సంపాదకీయంలో రూపొందించిన నాలుగో సింహం పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పోలీసుల సాదక బాదకాలు, శాంతిభద్రత విషయంలో కష్టపడుతున్న తీరు వంటి ఎన్నో అంశాలపై పుస్తకం తీసుకురావడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు భీమ శ్రీనివాసరావు, జేవీ.కుమార్, రవీంద్రబాబు, గజవెల్లి సత్యనారాయణ, కావ్య, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

## శిథిలావస్థలో జియాగూడ మంచినీటి కార్యాలయం



జియాగూడ మంచినీటి కార్యాలయం



నిరుపయోగంగా డ్రైనేజీ క్లీనింగ్ మెషీన్

**జియాగూడ:** జియాగూడ మంచినీటి కార్యాలయం, అండర్ గ్రౌండ్ వాటర్ సంప్ రూమ్‌లు శిథిలావస్థకు చేరుకున్నాయి. జియాగూడ డివిజన్ పరిధిలోని 27 బస్తీలకు నీటి సౌకర్యం, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించడానికి కృషిచేస్తుంది. ఇన్ని బస్తీలకు తాగునీరు సమస్యలు పరిష్కరించడానికి మేనేజర్ లేకపోవడంతో సిబ్బంది నామ్‌కే వాస్తేగా విధులు నిర్వహిస్తున్నారు. 1974లో జియాగూడ ఎంసీహెచ్ క్వార్టర్స్‌కు నీరు అందించడానికి నిర్మించిన అండర్ గ్రౌండ్ వాటర్ సంప్ రూమ్‌లు పెచ్చులూడుతున్నాయి. మరమ్మతులు చేపట్టకపోవడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోనని సిబ్బంది భయపడుతున్నారు.

**పాడైన డ్రైనేజీ క్లీనింగ్ మెషీన్..**

జియాగూడ మంచినీటి కార్యాలయంలోని డ్రైనేజీ క్లీనింగ్ మెషీన్ మోటార్ వెహికల్ పాడై మూలనపడింది. దీంతో జియాగూడ బస్తీల డ్రైనేజీ సమస్యలు సత్వరమే పరిష్కారం కావడం లేదు. రోజుల తరబడి ఫిర్యాదు దారులు ఎదురు చూస్తున్నారు. ఇకనైనా అధికారులు చర్యలు తీసుకోవాలని బస్తీల వాసులు కోరుతున్నారు.

## ఉద్యోగులకు అండగా టీఎన్జీఓస్



క్రీడాకారులతో ఎస్ఎం ముజీబ్ హుస్సేని, కేఆర్.రాజ్‌కుమార్ తదితరులు

**అబిడ్స్:** ఉద్యోగులకు టీఎన్జీఓస్ యూనియన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని టీఎన్జీఓస్ కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ఎం.ముజీబ్ హుస్సేని పేర్కొన్నారు. బుధవారం గగన్‌మహల్ మైదానంలో జరిగిన క్రికెట్ పోటీల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. టీఎన్జీఓస్ ఆధ్వర్యంలో జరిగే ఈ పోటీల ద్వారా విజేతలకు బహుమతులు అందజేసి సత్కరిస్తామన్నారు. ప్రతి ఒక్కరికీ క్రీడలతో పాటు యోగా, వాకింగ్ ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు ఎంబీ.కృష్ణాయాదవ్, బి.శంకర్, కేఆర్.రాజ్‌కుమార్, కుర్రాడి శ్రీనివాస్, ఖలీద్ అహ్మద్, ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

### పాలమూరు యూనివర్సిటీకి కపిలవాయి లింగమూర్తి పేరు పెట్టాలి

**గన్‌ఫౌండ్రీ:** పాలమూరు యూనివర్సిటీకి కపిలవాయి లింగమూర్తి పేరు పెట్టాలని రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ, విశ్వకర్మ మాతృ సంఘం ప్రభుత్వాన్ని కోరింది. బుధవారం బషీర్‌బాగ్‌లోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేములవాడ మదన్‌మోహన్ మాట్లాడారు. తెలంగాణ సాహిత్యానికి పునర్జీవం తీసుకొచ్చేందుకు కృషి చేసిన వ్యక్తి కపిలవాయి లింగమూర్తి అన్నారు. పాలమూరు బిడ్డ కపిలవాయి పేరును విశ్వవిద్యాలయానికి నామకరణం చేయడం వల్ల సాహితీ వేత్తలందరిని గౌరవించినట్లవుతుందని తెలిపారు. సంఘం గౌరవ అధ్యక్షుడు డాక్టర్ లాలుకోట వెంకటాచారి, ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచారి, కోశాధికారి రవీంద్రచారి పాల్గొన్నారు.

### నేడు జాబ్ మేళా

**విజయనగర్‌కాలనీ:** రంగారెడ్డి జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో నేడు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఉపాధి అధికారి జి.జయశ్రీ ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్ఎస్సీ, ఇంటర్మీడియేట్, ఏదైనా డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా విద్యార్హత కలిగి ఉండి 18 నుంచి 30 ఏళ్ల లోపు నిరుద్యోగులు అర్హులన్నారు. నగరంలోని ప్రముఖ ప్రైవేటు సంస్థల్లోని ఉద్యోగాల భర్తీకి ఈ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అంతేకాకుండా మేజిక్ బస్సు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇక్కడ రెండు నెలల పాటు ఉచిత స్పోకెన్ ఇంగ్లిష్, కంప్యూటర్ కోర్సులలో శిక్షణను ఇచ్చి ఉద్యోగ ఉపాధి కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు గురువారం ఉదయం 10.30 గంటలకు ధ్రువీకరణ పత్రాలు, ఫొటోలతో విజయనగర్‌కాలనీలోని రంగారెడ్డి జిల్లా ఉపాధికల్పనా కార్యాలయంలో నేరుగా హాజరుకావాలన్నారు. వివరాలకు 90630 99306లో సంప్రదించవచ్చు.



## పారిశుద్ధ్య కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలి



నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు, నాయకులు

**గోల్కొండ:** పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించి వారికి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని మున్సిపల్ యూనియన్ డేట్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కార్యదర్శి సి.మల్లేష్ డిమాండ్ చేశారు. గుడిమల్కాపూర్ వార్డు కార్యాలయం ముందు కార్మికులతో కలిసి నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలన్నారు. అలాగే వారి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కిరణ్, వెంకటేష్, శ్రీకాంత్, శ్రీనివాస్, నాయకురాలు నరసమ్మ, మంగమ్మ, అనుజా పాల్గొన్నారు.

## ‘చలో రాజ్‌భవన్’కు తరలిన కాంగ్రెస్ శ్రేణులు

**గోల్కొండ:** టీపీసీసీ ఆధ్వర్యంలో బుధవారం చలో రాజ్‌భవన్ కార్యక్రమానికి కార్వాన్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కురాకుల కృష్ణ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. కురాకుల కృష్ణ మాట్లాడుతూ.. ప్రధాని మోదీ పాలనలో అత్యున్నతమైన భారత రాజ్యాంగం నిర్వీర్యమయ్యిందన్నారు. కేవలం తమ పార్టీ ఎజెండాను మాత్రమే పాటిస్తూ ప్రజాస్వామ్యాన్ని మోదీ మంటగలుపుతున్నారన్నారు. కాంగ్రెస్ నాయకులు చంద్రశేఖర్, చంటిబాబు, కిషన్, హబీబ్, పరమానందం తదితరులున్నారు.

**గోషామహల్ నుంచి..**

**అబిడ్స్:** గోషామహల్ నియోజకవర్గానికి చెందిన ఏఐసీసీ కో ఆర్డినేటర్ నిర్మల్‌కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం గోషామహల్ నుంచి రాజ్‌భవన్ వరకు నిరసన వ్యక్తం చేశారు. నిర్మల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ..కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఆదానిలాంటి వారికే కొమ్ముకాస్తుందని ఆరోపించారు. జమిల్, బాల్‌చందర్, విశ్వేశ్వర్‌రావు, రెహ్మాన్, రమణరెడ్డి, వెంకటేష్ పాల్గొన్నారు.

**పాతబస్తీ నుంచి..**

**గౌలిపురా:** ఏఐసీసీ పిలుపు మేరకు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం చలో రాజ్‌భవన్‌కు పాతబస్తీ నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు తరలివెళ్లారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కె.వెంకటేశ్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళా నేతలతో కలిసి నెక్లెస్ రోడ్డు నుంచి రాజ్‌భవన్ వరకు ప్రదర్శనగా వెళ్లారు. ఈ కార్యక్రమంలో మహిళా నాయకురాలు సుబ్బురు మల్లిక, కృపారెడ్డి, అరుణ తదితరులు ఉన్నారు.



తరలివెళ్తున్న కార్వాన్ కాంగ్రెస్ నేతలు



నిర్మల్‌కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో..



మహిళా నాయకులతో కె.వెంకటేశ్

## 22న సారంగి అవార్డుల ప్రదానం



**గన్‌ఫౌండ్రీ:** ఔత్సాహిక యువ నటీనటుల ప్రతిభను గుర్తించి అవార్డులను ఇవ్వడం అభినందనీయమని ప్రముఖ సినీ దర్శకుడు రాఘవేందర్ రావు అన్నారు. 22న రవీంద్రభారతిలో నిర్వహిస్తున్న సారింగి ఫిల్మ్ అవార్డ్స్ వాల్‌పోస్టర్‌ను బుధవారం ఆయన ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ..కళాకారులకు అవార్డులు ఎంతో బలాన్ని చేకూరుస్తాయన్నారు. ఈ కార్యక్రమానికి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, శ్రీధర్ బాబు, ఛలనచిత్ర అభివృద్ధి మండల చైర్మన్ దిల్‌రాజుతో పాటు పలువురు ప్రముఖులు హాజరవుతారని సంస్థ అధ్యక్షుడు ఖాజ అఫ్రిది తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు సుమన్, శ్రీకాంత్, సన్ని పాల్గొన్నారు.

### 23న వ్యాస రచన పోటీలు

**చార్మినార్:** రతన్ టాటా జయంతిని పురస్కరించుకొని వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్ తెలిపారు. తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ఈనెల 23న ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నగరంలోని వివిధ కళాశాలలో, యూనివర్సిటీలలో ఎంబీఏ చదువుతున్న విద్యార్థులకు తెలుగు, ఇంగ్లిష్, హిందీ, ఉర్దూ భాషలలో వ్యాస రచన పోటీలను నిర్వహించనున్నామన్నారు. సరోజిని నాయుడు వనిత మహా విద్యాలయం, ఎగ్జిబిషన్ గ్రౌండ్ ఎంబీఏ బ్లాక్‌లో ఈ పోటీలు నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. రతన్ టాటా ఏ విజినరీ లీడర్ షేపింగ్ పిలాంత్రపి అండ్ బిజినెస్ ఇన్ ఇండియా..అనే అంశంపై వ్యాసరచన పోటీలు ఉంటాయన్నారు. ఈనెల 28న ఉదయం 10 గంటలకు అబిడ్స్ బొగ్గులకుంటలోని తెలంగాణ సరస్వత పరిషత్ ఆడిటోరియంలో విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు, మెడల్స్ ప్రదానం చేస్తామని ఆయన తెలిపారు. మరిన్ని వివరాలకు వివరాలకు 994882604లో సంప్రదించాలన్నారు.